సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



గంజాయి పట్టివేత

జిల్లాలో రెండు చోట్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైళ్ల ద్వారా రవాణా చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. - 8లో



వెంటాడిన మృత్యువు

జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు. ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. - 8లో

12న అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ)లో ఈ నెల 12న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు బుధవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని చెప్పారు. శ్యాం క్రగ్ పిస్టన్స్, నాగార్జున ఆగ్రో కంపెనీ లిమిటెడ్, స్మార్ట్‌కెం టెక్నాలజీస్, వరుణ్ మోటర్స్ వంటి ఎనిమిది కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

విద్యాశాఖాధికారులకు ఉద్యోగోన్నతి



కె.వెంకటేశ్వరరావు



జి.పగడాలమ్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాశాఖలో అధికారుల ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో నెంబర్ 46 వెలువరించింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తూ డీఈవో(ఎఫ్ ఏసీ)గా వ్యవహరిస్తున్న కె.వెంకటేశ్వరరావుకు పదోన్నతిపై జిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ పదోన్నతి కల్పించింది. టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న గార పగడాలమ్మకు పార్వతీపురం మన్యం జిల్లా డీఈవోగా నియమించింది. పగడాలమ్మ గతంలో శ్రీకాకుళం డీఈవోగా వ్యవహరించారు. వీరి పదోన్నతుల పట్ల ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘ నాయకులు సంతోషం వ్యక్తంచేశారు. పలువురు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

అరసవల్లి: రథసప్తమి మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అధి కారులను ఆదేశించారు. బుధవారం ఏఎస్పీ ప్రేమ్ కాజల్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గతంలో చేసిన ఏర్పాట్లు, ప్రస్తుతం చేపడుతున్న పనులపై ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ అధికార సిబ్బంది బి.ఎస్.చక్రవర్తిలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ భక్తులు, వీఐపీలు, క్షీరాభిషేక దర్శన, దాతల పాసులతో వచ్చే మార్గాలను పరిశీలించారు. గతంలో జరిగిన లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ తలెత్తకుండా అన్ని మార్గాల్లోనూ పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈమె వెంట ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ శృతి, వన్‌టౌన్ సీఐ ఎల్.ఎస్.నాయుడు, ట్రాఫిక్ సీఐ అవతారం, ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి

రణస్థలం: కుటుంబ జీవనోపాధి పెంచేందుకు మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కుప్పిలి వరప్రసాద్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీలో నాబార్డు, యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం సహకారంతో జీవనోపాధుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో వివిధ ఆహార పదార్థాలను తయారు చేసే విధానంపై 20 రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. స్వయం శక్తి సంఘాలలోని మహిళలు యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రొగ్రాం కో ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చిరు ధాన్యాల వల్ల కలిగే లాభాలు వివరించారు. డీసీసీబీ మేనేజర్ వి.ప్రసూన, సూపర్‌వైజర్లు శ్రీజ, పోలినాయుడు, సభ్యులు జి.అప్పలనాయుడు, ఎస్.స్వప్న, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు 'ఎలుగు'



పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చీపురుపల్లి పంచాయతీ కొండపల్లిలో బుధవారం ఎలుగుబంటి కలకలం సృష్టించింది. ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి ప్రవేశించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణభయంతో వణికిపోయారు. ఎలుగు సంచారాన్ని గమనించిన స్థానికులు ఉపాధ్యాయులతో కలిసి కేకలు వేయడంతో అక్కడ నుంచి గ్రామవీధుల్లోకి జారుకుంది. దీంతో ప్రజలు ప్రాణభయంతో హడలిపోయారు. కాగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే చోట ఉండటంతో సుమారు 30 మంది చిన్నారులు ఉన్నారు. ఎలుగు సంచరించిన సమయంలో చిన్నారులు ఆరుబయట లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇటీవల ఎం.గడూరులో జరిగిన ఎలుగు దాడిలో నలుగురు గాయపడ్డారు. వీరిలో కుమారస్వామి, నారాయణమ్మలు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆ ఎలుగు దాడి మరువకముందే మరో ఎలుగు సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



శ్రీకాకుళం 24వ డివిజన్‌లోని మహాలక్ష్మినగర్‌లో ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వస్తున్న లబ్ధిదారులు

రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సచివాలయంలో కూర్చున్న లబ్ధిదారులు





రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ఇంటి పట్టాతో మహిళ

చకచకా రిజిస్ట్రేషన్లు


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా చురుగ్గా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో జగనన్న కాలనీ ఇళ్లు, స్థలాలకు సిబ్బంది రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా వివరాలు నమోదు చేస్తూ పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

సంక్షేమ బాటలో ప్రగతిపూలు

బడ్జెట్‌లో రెండింటికీ సమపాలు

- సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలకూ ప్రత్యేక దృష్టితో నిధులను కేటాయించింది. జిల్లాలో కీలకమైన మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రాధాన్యతగా చెప్పుకొచ్చింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మూడు నెలల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏం చేసిందో కళ్లకు కట్టినట్టు లెక్కలతో సహా పేర్కొంది.

ప్రతి పథకం కొనసాగేలా..

మూడు నెలల నిర్వహణ కోసం రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలకు చోటు కల్పించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత తదితర అంశాలు ప్రాధాన్యతగా ప్రస్తావించారు.

ఎన్నికలు ఉన్నాయి కదా.. అని ఏ ఒక్కటీ ఆపే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. జిల్లాకు సంబంధించిన కీలక ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, త్వరలో పూర్తి కావస్తాయని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి స్పష్టం చేశారు. ప్రారంభమైన ఉద్దానం ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. కిడ్నీ రోగులకు అందిస్తున్న సేవలు, సాయంపైన వివరించారు. మూడు నెలలు బడ్జెటైనప్పటికీ శాఖల వారీగా కేటాయించిన నిధులు సంతృప్తికరంగా ఉన్నాయి.ఇచ్చిన మాట మేరకు ప్రతీది చేసి చూపించామని గణంకాలతో సహా బడ్జెట్‌లో పేర్కొనడం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రత్యేకతగా చెప్పుకోవాలి.



విద్యకు ప్రాధాన్యం..



దేశంలో అమలవుతున్న నూతన విద్యా విద్యావిధానానికి అనుగుణంగా విద్యారంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు. ఏపీ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణ వల్ల మూడు ప్రైవేట్ వర్సిటీలకు అనుమతులు ఇచ్చారు. ప్రైవేట్ రంగంలో వర్సిటీలు ఏర్పాటు వల్ల ఉన్నత విద్య మరింత బలోపేతం అవుతుంది. హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, పాలిటెక్నిక్ డిప్లమా వంటి కోర్సులు ప్రారంభం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

- డాక్టర్ ఎం.సూరిగణేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్

బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట



ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారు. నవరత్నాలు కేటాయింపులు మెరుగ్గా ఉన్నాయి. బడ్జెట్ లోటు, ఆర్థిక మాంద్య పరిస్థితులు ఉన్నా సంక్షేమాన్ని విస్మరించలేదు. ద్రవ్య లోటు నియంత్రణా చట్టం నిబంధనలకు లోబడి ప్రజా సంక్షేమం లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు.

- ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వ వీసీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

అభినందనీయం



బడ్జెట్‌లో పాఠశాల విద్యకు అగ్రతాంబులం ఇవ్వడం అభినందనీయం. అంతర్జాయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలని సంకల్పించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. ఉద్యోగ, పెన్షనర్లకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

- పేడాద దాలినాయుడు, ఎంఈవోల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

20న శాలిహుండం గిరియాత్ర



కరపత్రికను విడుదల చేస్తున్న ఆలయ ధర్మకర్త, ప్రజాప్రతినిధులు

గార: ఈ నెల 20న భీష్మ ఏకాదశి పురస్కరించుకుని గార మండలంలోని శాలిహుండంలో వేణుగోపాలస్వామి గిరియాత్ర నిర్వహిస్తున్నామని డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయం వద్ద యాత్ర కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 19న సాయంత్రం స్వామి తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత నిజరూప దర్శనం, మంగళవారం వేకువజామున క్షీరాభిషేకం, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని ఉత్సవమూర్తులకు సమీప వంశధార నదిలో చక్రతీర్థ స్నానం, అనంతరం స్వామి దర్శనాలు ఉంటాయని వివరించారు. 24న స్వామి తిరుక్కల్యాణ మహోత్సవం, పుష్పయాగం జరుగుతుందని పేర్కొన్నారు. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పంచాయతీ, రెవెన్యూ, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలను సమన్వయపరచి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు మహేంద్రాడ సాయిశర్మ, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, గొండు సాధామణి, సర్పంచ్‌లు మార్పు పృథ్వీరాజ్, గొల్లంగి వెంకటేశ్వర్లు, జల్లు గౌరిపతినాయుడు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి, తోనంగి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.17.5 లక్షల టోకరా



శ్రీకాకుళం క్రైమ్ : క్రిప్టో కరెన్సీ ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో నగదు వస్తుందని చెప్పి జిల్లాకేంద్రంలోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి సైబర్ కేటుగాళ్లు రూ.17.5 లక్షలకు టోకరా వేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట్‌కు చెందిన నంబళ్ల గ్రీష్మిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. వర్క్‌ఫ్రం హోం కావడంతో భర్త కొప్పళ్ల గౌరీ జగదీష్ ప్రసాద్‌తో కలిసి నగరంలోనే నివాసముంటోంది. కొన్నిరోజుల కిందట 'ఓకేఎక్స్-33.సిఒఎం' పేరిట వచ్చిన వెబ్‌సైట్ లింక్ ఓపెన్ చేయడంతో టెలిగ్రామ్ యాప్ ద్వారా, కొంత మంది ఫోన్లు (07043871700, 08349714428, 07043904299) నంబర్లు ద్వారా కాంటాక్ట్ అయ్యారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే నగదు ఎక్కువ మొత్తంలో వస్తుందని చెప్పడంతో గ్రీష్మిత తన భర్త ద్వారా మొదట్లో తక్కువ మొత్తంలో అమౌంట్ పంపింది. దానికి బదులుగా ఎక్కువ మొత్తం వేయడంతో దఫదఫాలుగా రూ. 17.5 లక్షలు పంపించారు. అయినప్పటికీ వారు నగదు పంపకపోగా టెలిగ్రామ్‌లో ఈమె నెంబర్లను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన గ్రీష్మిత ముందుగా సైబర్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బుధవారం రాత్రి రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ చెప్పారు.

డీఎస్సీకి సై..



- టీచర్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 305 పోస్టులు భర్తీ అయ్యే అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ పోస్టులకు సన్నద్ధమౌతున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. డీఎస్సీ 2024 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 6100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుండగా.. అందులో శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 305 వరకు పోస్టులు భర్తీ కానున్నట్టు తెలిసింది. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 2న ఫైనల్ కీ వెలువడనుండగా, ఏప్రిల్ 7న తుది ఫలితాలు వెల్లడికానున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్లలో కలిపి 305 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు సమాయత్తమౌతున్నారు. ఇందులో ఎస్‌జీటీలు 104, స్కూల్ అసిస్టెంట్లు 130, టీజీటీలు 49 పోస్టులను కలిపి 283 టీచర్లతోపాటు పీజీటీలు, ప్రిన్సిపాళ్లు మరో 22 వరకు భర్తీ కానున్నాయి. వీటిలో జెడ్పీ/ఎంపీపీ మేనేజ్‌మెంట్, ప్రభుత్వ యాజమాన్యం, ఏపీమోడల్ స్కూల్స్, మున్సిపల్ మేనేజ్‌మెంట్, ఏపీఆర్‌ఎస్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ యాజమాన్యాల్లో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు, పీడీలు, టీజీటీలు, పీజీటీలు, ప్రిన్సిపాళ్ల పోస్టులు భర్తీ కానున్నాయి.

నేటి నుంచి టెట్‌కు దరఖాస్తులు..

డీఎస్సీకి ముందే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించేందుకు ఇప్పటికే ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈసారి టెట్‌ను, డీఎస్సీని విడివిడిగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత టెట్ నిర్వహించి, ఆ తర్వాత డీఎస్సీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో టెట్‌కు ఫిబ్రవరి 8 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 23 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకు రెండు సెషన్స్‌లో ఏపీ టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 14న ఫలితాలను వెలువరిస్తారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

ఎస్‌జీటీలు	స్కూల్ అసిస్టెంట్లు	టీజీటీలు	పీజీటీలు/ప్రిన్సిపాళ్లు
104	130	49	22

రూ.265 కోట్లతో తాగునీటి పనులు



సీఎం జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వంశధార తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లతో వెంటనే పనులు ప్రారంభించాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి సూచించారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డిని శాసన సభ ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాతపట్నంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను సీఎంకు వివరించారు. ప్రాధాన్యతా క్రమంలో తాగునీటి పనులు ప్రారంభించాలని సీఎంను కోరగా.. ప్రారంభోత్సవం కంటే పనులు చేపట్టడం ముఖ్యమని, తక్షణమే పనులు చేపట్టేలా ఆదేశాలు ఇస్తామని చెప్పారు. జిల్లాల పునర్విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో సీతంపేట ఐటీడీఏ ఉండిపోవటంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన గిరిజనులు అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని విన్నవించగా.. సీఎం సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ప్రకటన వస్తుందన్నారు. ఈ రెండు పనులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ధనుంజయరెడ్డికి సూచించారని పేర్కొన్నారు. పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం, ఎల్.ఎన్.పేట మండలంలో పోలీసు స్టేషన్ ఏర్పాటుపైనా చర్చించామన్నారు.

సమర్థంగా ఎన్నికల విధుల నిర్వహణ

- త్వరలో నియోజకవర్గ స్థాయిలో శిక్షణ
- ఏఎల్ఎంటీ తరగతుల్లో కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ చెప్పారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు-2024లకు సంబంధించి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. పోలింగ్‌కు ముందుగా మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, వి.వి.ప్యాట్స్, ఈవీఎంలు, తదితర అంశాలపై ప్రసంగించారు. ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని స్పష్టం చేశారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా తరగతులకు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అనంతరం మెప్మా పీడీ, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల విధులు, తదితర అంశాలను వివరించారు. మాక్ పోలింగ్, పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై మాస్టర్ ట్రైనర్ చిట్టిరాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ రామ్మోహనరావు, పలాస ఆర్డీఓ డాక్టర్ భరత్‌నాయక్, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో వర్షం



కొత్తూరు: మండలంలో బుధవారం రాత్రి వర్షం కురిసింది. కుంటిభద్ర, పారాపురం, ఎన్ఎన్ కాలనీ, కర్లెమ్మ, మహసింగి తదితర గ్రామాల్లో ఓ మోస్తరుగా జల్లులు పడ్డాయి. నువ్వుసాగుతో పాటు పూత దశలో ఉన్న మామిడి, జీడి పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో బాలల హక్కుల కమిషన్ పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం తదితరులు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళగిరి నుంచి బుధవారం ప్రకటన విడుదలైంది. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్‌ను కలిసి బాలల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు. 11 గంటలకు అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు పట్టణంలోని కేజీబీవీ, 3గంటలకు రిమ్స్ ఆసుపత్రిని సందర్శించనున్నారు. అనంతరం రోడ్డు మార్గాన మంగళగిరి చేరుకోనున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఒడిశా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సారవకోట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వక్తలు పేర్కొన్నారు. సారవకోట మండలం కిడిమి గ్రామ సమీపంలో పద్మాపురం గ్రామానికి చెందిన రావాడ మోహనరావు సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఒడిశా రాష్ట్రం కెందూరఝూర్ చెందిన 41 మంది రైతులు బుధవారం సందర్శించారు.జిల్లా సేంద్రియ సాగు సిబ్బంది ఆధ్వర్యంలో మెలకువలు తెలుసుకున్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు మొక్కల సాగు విధానాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ గోవింద రెడ్డి, ఎంటీ రమణ, వైభవ లక్ష్మి, జ్యోతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి



రిలే నిరాహార దీక్షలో న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే ఏపీ రాష్ట్ర భూహక్కు చట్టం - 22ను తీసుకురావడం అన్యాయమని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తక్షణమే రద్దు చేయాలని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర భూహక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం అమల్లోకి వస్తే సామాన్యులు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రిలే నిరాహార దీక్షలో సూర్యారావుతో పాటు ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, న్యాయవాదులు ఎం.భవానీప్రసాద్, కట్ట పార్థసారథి, కొండాల సూర్యనారాయణ, పి.వి.రవి కూర్చున్నారు. వీరికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు సంఘీభావం తెలిపారు.

తల్లి మందలించడంతో బాలుడు అదృశ్యం



పృథ్వీరాజ్

శ్రీకాకుళం క్రైమ్ : ట్యూషన్ ఫీజు కట్టకుండా డబ్బులు ఏం చేశావని తల్లి మందలించడంతో బలగ బండారి వీధికి చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. సాధు శివనారాయణ, రాధ దంపతుల కుమారుడు పృథ్వీరాజ్ నగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో పదో తరగతి చదివిస్తున్నాడు. ఈ నెల 6న ట్యూషన్ ఫీజు రూ.1000 కట్టాలని చెప్పగా తల్లి రూ.500 ఇచ్చింది. సాయంత్రం పృథ్వీరాజ్ ఇంటికొచ్చాక ఫీజు కట్టలేదని తెలుసుకున్న తల్లి మందలించింది. దీంతో అదే రోజు రాత్రి పదిగంటలకు ఎవరికీ చెప్పకుండా పృథ్వీరాజ్ బయటకు వెళ్లిపోయాడు. అన్నిచోట్లా వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

శరవేగంగా రైల్వేట్రాక్ పనులు



గంగువాడ రైల్వేగేటు వద్ద ట్రాక్ పనులు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని గంగువాడ సమీపంలో రైల్వేగేటు వద్ద ట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రైల్వే ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పాతపట్నం-టెక్కలి రహదారిలోని రైల్వే గేటును పూర్తిస్థాయిలో మూసివేసి యంత్రాలతో పనులు చేయించారు. ట్రాక్ పనులు పూర్తయిన వరకు ట్రాఫిక్‌ను టెక్కలి నుంచి తెంబూరు మీదుగా సారవకోటకు మళ్లించారు. ఇటీవల పర్లాకిమిడి-గుణుపూర్ రైల్వే ట్రాక్ ఫాస్ట్ ట్రాక్ పనులు వేగవంతం చేసి స్పీడ్ రైలు ట్రైల్ కూడా వేశారు.

వెంటాడిన మృత్యువు

వేర్వేరు ప్రమాదాల్లో జిల్లాకు చెందిన పలువురు మృత్యువాతపడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత
- విషాదంలో కుటుంబ సభ్యులు



మృతిచెందిన జగదీశ్వరి

రైలు కింద పడి బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి



రాము(ఫైల్)

టెక్కలి రూరల్: దేశరక్షణలో సేవలందిస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్‌ను మృత్యువు వెంటాడింది. కుటుంబ సభ్యులను చూసేందుకు వస్తుండగా జరిగిన రైలు ప్రమాదంలో జవాన్ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి మండలం గూడేం గ్రామానికి చెందిన పిట్ట రాము(36) పశ్చిమబెంగాల్ రాష్ట్రం రాయ్‌గంజ్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. సెలవులపై ఇంటికి వచ్చేందుకు మంగళవారం రాత్రి కల్దా నుంచి పలాసకు రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో కోలకత్తా సమీపంలో రైలు కింద పడటంతో మృతిచెందారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా ఇంకేదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. మృతుడి భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో కలిసి టెక్కలి ఎస్‌టీఆర్ కాలనీ 6వ లైన్‌లో నివాసముంటోంది. మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. జవాన్ మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు సమాచారం.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి మహిళ మృతి

టెక్కలి రూరల్: నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన గొాడు జగదీశ్వరి(30) అనే మహిళ ట్రాక్టర్ పైనుంచి జారిపడి మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదీశ్వరి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల కోసం బుధవారం కాలినడకన బయలుదేరింది. మార్గమధ్యలో ట్రాక్టర్ ఎక్కి వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త దుర్యోధనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ బోల్తాపడి వ్యక్తి దుర్మరణం



శ్రీనివాసరావు(ఫైల్)

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట పంచాయతీ పంగవానిపేటకు చెందిన పంగ శ్రీనివాసరావు(46) మంగళవారం రాత్రి కర్నూలు జిల్లా గుత్తి జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం నుంచి హైదరాబాద్ వెళ్తున్న పశువుల కంటైనర్ గుత్తి టోల్ ప్లాజా వద్ద బోల్తా పడగా అక్కడే ఉన్న శ్రీనివాసరావుతోపాటు తునికి చెందిన మరో వ్యక్తి మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య శ్రీదేవి, కుమారుడు సుధీర్, కుమార్తె యమున ఉన్నారు. గుత్తి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• స్పందించిన దాతలు



నగదును అందిస్తున్న దాతలు

పొందూరు: 'తల్లిదండ్రులు దూరం.. భవిత భారం' శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.లక్ష వరకు నగదును అందించారు. గత నెల 17న విశాఖ జిల్లా ఆనందపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయిన సంగతి తెలిసిందే. మృతుడు కొండేటి శంకర్ పదో తరగతి చదివిన పాఠశాలలో 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.30 వేలు, మలకాం సర్పంచ్ జాడ శ్రీనివాసరావు రూ.10 వేలు, దండా హరనాథరావు రూ.10 వేలు, డాక్టర్ దండా విజయ్‌కుమార్ రూ.5 వేలు, జి.వి.సత్యనారాయణ రూ.5 వేలు, పి.కృష్ణాజీ రూ.5 వేలు, పి.జోగినాయుడు రూ.5 వేలు, కైలాసరావు రూ.5 వేలు చొప్పున లక్ష రూపాయలకు పైగా అందించారు.

దాతలు సాయం చేయదలచుకుంటే ఫోన్ పే నంబర్ **9912474529** కు నగదును పంపించాలని చిన్నారులు విజ్ఞప్తి చేశారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు



రాంబాబు పార్థివ దేహానికి వందనం సమర్పిస్తున్న ఐటీబీపీ బృందం

గార: ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్ (పారా మిలిటరీ) హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మృతిచెందిన గార మండలం రామచంద్రాపురం పంచాయతీ శిమ్మపేట గ్రామానికి చెందిన దుంగ రాంబాబు పార్థివ దేహానికి బుధవారం అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం కెరియా జిల్లాలోని శిక్షణా కేంద్రంలో సోమవారం ఉదయం రాంబాబు మృతి చెందగా, భౌతికకాయాన్ని ఐటీబీపీ ఆనందపురం యూనిట్ బుధవారం ఉదయం స్వగ్రామం తీసుకువచ్చారు. రాంబాబు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటివద్ద సంప్రదాయ కార్యక్రమం ముగించగా.. ఐటీబీపీ బృందం ఆధ్వర్యంలో శ్మశానవాటికకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్లు దిలీప్‌కుమార్, రాకేష్‌శర్మ గౌరవవందనం చేశారు. గార ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి సెల్యూట్ చేశారు. అనంతరం బృంద సభ్యులు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అంత్యక్రియలు పూర్తయ్యాక జాతీయ పతాకాన్ని హెచ్‌సీ రాంబాబు భార్యకు అధికారులు అందజేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు



గాయపడిన చంద్రశేఖర్

టెక్కలి రూరల్: నందిగాం మండలం బాణాపురం సమీపంలో బుధవారం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న పల్లెవెలుగు బస్సు ఆగి ఉన్న సమయంలో అదే మార్గంలో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న నందిగాం మండలం చిన్న లవునపల్లికి చెందిన కె.రాము, ఆనందపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి లతశ్రీ, సారవకోట మండలం మత్రిపాడుకు చెందిన జన్ని ఉపేంద్రలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నందిగాం ఎస్‌ఐ మహ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- టెక్కలి మండలం వలేసాగరం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి నుంచి సీతాపురం వైపు కూన చంద్రశేఖర్, అతని స్నేహితుడు బమ్మిడి వినోద్ కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా జీడిపేట గ్రామానికి చెందిన ప్రొక్లెయినర్ ఆపరేటర్లు మంగిపేట కృష్ణారావు, ఆనంద్ కలిసి మరో ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. వలేసాగరం వద్ద పరస్పరం ఢీకొన్నారు. నలుగురికీ గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు టెక్కలి పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



ప్రమాదానికి గురైన వాహనాలు

కాశీబుగ్గ: నందిగాం మండలం బాణాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. శ్రీకాకుళం నుంచి పలాసకు 50 మంది ప్రయాణికులతో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేటు సిబ్బంది స్పందించి నేషనల్ హైవే అంబులెన్స్‌ను ఘటనా స్థలానికి పంపించారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రమాదానికి గురైన వాహనాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

రేషన్ డిపోపై విజిలెన్స్ దాడి



అధికంగా ఉన్న సరుకుని స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురంలో రేషన్ డిపోపై మంగళవారం రాత్రి విజిలెన్స్ బృందం ఆకస్మికంగా దాడి చేసింది. లెక్కకు మించి నిల్వ సరుకులు ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ ఎస్‌ఐ బి.రామారావు నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. 113 కేజీలున్నర పీడీఎస్ బియ్యం అధికంగా ఉండగా, 19 పంచదార ప్యాకెట్లు ఎక్కువగా, 15 కేజీల కందిపప్పు ప్యాకెట్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్ డీలర్ బోరుబద్ర లోహిదాసుపై కేసు నమోదు చేసి డిపో బాధ్యతలను కీర్తిపురం రేషన్ డీలర్ వలపల వెంకటరమణకు అప్పగించారు. తనిఖీల్లో ఆర్‌ఐ పి.చూడామణి, కేశుపురం వీఆర్వో శంకరావు, కేదారిపురం గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ దుర్గాశి లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై కమిటీల ఏర్పాటు



సమీక్ష నిర్వహిస్తున్న వీసీ కె.ఆర్.రజిని

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని అవినీతి రహిత వర్సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో బుధవారం గ్రీవెన్స్‌సెల్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా మూడు ఫిర్యాదులపై కమిటీలు వేశారు. గత వీసీ నిమ్మ వెంకటరావు టెర్మ్ ముగింపు సమయం ముందు నియమించిన 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు రూలాఫ్ లాకు వ్యతిరేకంగా జరిగాయంటూ దళిత సంఘాలు ఫిర్యాదు చేయడంపై సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన కమిటీ వేశారు. 24 కాంట్రాక్టు బోధకులు తొలగింపు, ఇందులో 11 మంది కొనసాగింపుపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశంపై కె.స్వప్నవాహిణి అధ్యక్షతన కమిటీ వేశారు. వర్సిటీలో 2008 ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు నియమించిన అన్ని రకాల టీచింగ్, నాట్ టీచింగ్ పోస్టులు వివరాల సేకరణకు ఎం.అనురాధ అధ్యక్షతన కమిటీ వేశారు. కమిటీల నివేదికలు తర్వాత తదుపరి చర్యలు ఉంటాయన్నారు. న్యాయ నిపుణులు, పాలక మండలి, స్టాండింగ్ కౌన్సెల్ సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. గ్రీవెన్స్ కమిటీ సమీక్షలో అధ్యక్షురాలు యు.కావ్యజ్యోత్స్న, సభ్యులు కె.తారక రామారావు, కె.ఉదయ్‌కిరణ్, ఎల్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు అప్పయ్యదొర జయంతి

కాశీబుగ్గ:

దివంగత మాజీ పార్లమెంట్ సభ్యుడు అప్పయ్యదొర 88వ జయంతి కార్యక్రమం గురువారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు హనుమంతు రామ్మోహనదొర ఒక ప్రకటనలో తెలిపారు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని దొర విగ్రహం వద్ద జరిగే కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు జిల్లా నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ బెండిగేటు వద్ద అప్పయ్యదొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రవాణా సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

నరసన్నపేట:

రహదారి భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చని రవాణా సహాయ కమిషనర్ ఏ.చంద్రశేఖరరెడ్డి అన్నారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా నరసన్నపేటలోని సెయింట్ క్లారెట్ స్కూల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణా చర్యలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేయకూడదన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, మైనర్లు వాహనాలు నడిపితే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, ప్రిన్సిపాల్ బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న ప్రవాసాంధ్రుడు వసంతరెడ్డి, స్నేహితులు

ఇచ్ఛాపురం రూరల్: విదేశాల్లో మృతిచెందిన ఓ తెలుగు వ్యక్తి కుటుంబానికి మేమున్నామంటూ అండగా నిలబడ్డారు ప్రవాసాంధ్రులు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన ఉప్పాడ సోమేశ్‌రెడ్డి పోలండ్‌లో కూలి పనికి వెళ్లి అనారోగ్యంతో గత డిసెంబర్ 16న మృతి చెందాడు. వెంటనే స్పందించిన 'పోలెండ్ తెలుగు అసోషియేషన్' (పోటా) సభ్యులు ఇటీవల కుటుంబానికి రూ.3లక్షల 75వేలను బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తాజాగా 'పోలాండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం' స్పందించింది. సంఘ సభ్యుడు వసంతరెడ్డి బుధవారం ధర్మపురం మృతుడి భార్య ఉప్పాడ పుష్ప, 9 నెలలు కుమార్తె కావ్యశ్రీలను కలిశారు. కావ్యశ్రీ పేరిట రూ.లక్షా 50వేలను సుకన్య యోజన రూపంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా, రూ.లక్షా 50వేలను తల్లీ, కుమార్తెల పేరిట పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మరో పదివేల నగదును అందజేశారు. దాతలను గ్రామస్తులు అభినందించారు.

41 కేజీల గంజాయితో బీహారీల అరెస్టు



పట్టుబడిన గంజాయి నిందితులతో సీఐ వెంకటరావు, సిబ్బంది

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో గంజాయితో పట్టుబడుతున్న కేసులు పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం గంజాయితో ఇద్దరు అరెస్టు కాగా తాజాగా బుధవారం మరో ఇద్దరు బీహారీలను పలాస జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం లైన్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిషా రాష్ట్రం ఆర్.ఉదయగిరి నుంచి సికింద్రాబాద్‌కు ఇద్దరు వ్యక్తులు గంజాయి పట్టుకుని రైలులో బయలుదేరారు. పలాసలో తనిఖీలు చేపట్టగా వారి నుంచి 19 ప్యాకెట్లలో 41 కేజీల గంజాయిని గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని బీహార్ రాష్ట్రం ఖగరియాజిల్లాకు చెందిన ఆకాష్ కుమార్, ప్రమోజిత్ కుమార్‌లగా గుర్తించారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపడుతుండగా వీరు పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో హెచ్‌సీలు కోదండరావు, మెట్ట సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

72 కేజీల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో 72 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్ఛాపురం పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు బుధవారం చిదంబరేశ్వరస్వామి ఆలయం సమీపంలో నిఘా వేసి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. పోలీసులు విచారించగా నాలుగు ట్రాలీ సూట్‌కేస్‌లు, బ్యాగ్‌లలో 72 కేజీలు గల 35 ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. బరంపురం నుంచి పూణేకి అక్రమ రవాణా చేసేందుకు ఇచ్ఛాపురం వరకు రోడ్డు ద్వారా తీసుకొచ్చినట్లు అంగీకరించారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ నుంచి పూణే వెళ్లేందుకు సిద్ధమవుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరంతా ఒడిశాకు చెందినవారుగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

ద్విచక్రవాహనం చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రెల్లివీధి బాలుర వసతి గృహంలో కుక్‌గా పనిచేస్తున్న వ్యక్తి ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఇందిరాకాలనీలో నివాసముంటున్న చింతాడ కృష్ణ ఈ నెల 4న ఉదయం ఆరుగంటలకు రెల్లివీధిలో వసతిగృహానికి వెళ్లి బయట ద్విచక్రవాహనాన్ని పార్క్ చేశాడు. మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీనిపై బుధవారం రాత్రి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

రెండు ఆలయాల్లో చోరీ

టెక్కలి: మండలంలోని విక్రంపురంలో ఒకే రోజు రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలు బుధవారం వెలుగులోకి వచ్చాయి. విక్రంపురంలోని మంకినమ్మ ఆలయంలో తులంన్నర బంగారం, 40 తులాల వెండి చోరీకి గురైంది. అదే గ్రామంలోని శివాలయంలో 35 తులాల వెండి, హుండీలో ఉన్న సుమారు రూ.90 వేల నగదును దుండగులు పట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు టెక్కలి పోలీసులకు సమాచారం అందజేశారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామంలో ఒకే రోజు రెండు ఆలయాల్లో చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

వర్సిటీ విద్యార్థికి అభినందనలు



బమ్మిడి రంజినిని అభినందిస్తున్న వీసీ రజిని, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అనూరాధ

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విభాగం ద్వారా న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ చివరి ఏడాది విద్యార్థిని బమ్మిడి రంజిని వర్సిటీకి బుధవారం చేరుకుంది. గత నెల 31 వరకు ఢిల్లీలో పరేడ్ శిక్షణ, వేడుకల్లో హాజరు, పార్లమెంట్ సందర్శన వంటి కార్యక్రమాల్లో పాల్గొన్న ఈమెను బుధవారం వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజిని అభినందించారు. విశ్వవిద్యాలయం ఖ్యాతిని దేశ రాజధాని వరకు తీసుకువెళ్లటం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

విజయగణపతికి దీపారాధన



శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి దేవాలయంలో స్వామివారికి అష్టోత్తర శత దీపారాధన బుధవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్